అందుబాటులోకి గోదాములు

గత ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసింది. ఆర్బీకేలను తీసుకువచ్చి ప్రభుత్వ సేవలను అందించింది. పంటలను నిల్వ చేసుకునేందుకు గోదాములు నిర్మించింది. దొరవారిసత్రం మండలంలో నాలుగు ప్రాంతాల్లో గోదాముల నిర్మాణాన్ని చేపట్టింది. ఒక్కొక్కటి 500 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం ఉండేలా చర్యలు తీసుకుంది. ఒక్కోదానికి రూ.40 లక్షలు ఖర్చు చేసింది. ప్రస్తుతం అవి అందుబాటులోకి వచ్చాయి. రైతులు పండించిన ఉత్పత్తులను అందులో నిల్వ చేసుకుని మంచి ధర వచ్చిన తర్వాత విక్రయించుకునేందుకు దోహదపడుతున్నాయి.


ఏకొల్లులో నిర్మించిన గోడౌన్, పక్కనే వేయింగ్ బ్రిడ్జి (కాటా)

- వైఎస్సార్ సీపీ హయాంలో నిర్మాణాలు ప్రారంభం
- నాలుగు ప్రాంతాల్లో పూర్తయిన భవనాలు
- 500 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం
- పంటలను నిల్వ చేసుకుంటున్న రైతులు

దొరవారిసత్రం: ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించక రైతులు అల్లాడుతున్నారు. దీనికితోడు దళారులు వారి శ్రమను దోచుకుంటున్నారు. ఈ విషయాన్ని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గుర్తించింది. దళారులకు చెక్ పెడుతూ గిట్టుబాటు ధర వచ్చే వరకు పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు గోదాముల నిర్మాణం చేపట్టింది. ఇందులో భాగంగా 2022–23లో దొరవారిసత్రం మండలంలోని ఏకొల్లు, వేణుంబాకం, తొగరాముడి, నెలబల్లి గ్రామాల్లో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాములు, వెయింగ్ బ్రిడ్జిలు నిర్మించింది. ఒక్కోదానికి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏపీఎస్) నిధులు రూ.40 లక్షలు ఖర్చు చేసింది. ఈనాలుగు గోదాములకు రైతులు పంట ఉత్పత్తులను సులువుగా రవాణా చేసుకునేలా సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.1.32 కోట్ల ఉపాధి నిధులను విడుదల చేసింది. ప్రస్తుతం గోదాముల నిర్మాణ పనులు పూర్తయి రైతులకు అందుబాటులోకి వచ్చాయి. దీంతో ఏకొల్లు, వేణుంబాకం, నెలబల్లి, తొగరాముడి పంచాయతీల్లోని రైతులు వేల బస్తాల ధాన్యాన్ని నిల్వ చేసుకున్నారు. ప్రస్తుతం ధాన్యానికి ధరలు లేవని, గోదాముల్లో నిల్వ చేసుకుని ధరలు వచ్చిన తర్వాత విక్రయించుకుంటామని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు చాలా మేలు జరిగింది



తీర ప్రాంత గ్రామాలకు నడిబొడ్డు గ్రామమైన తొగరాముడిలో అన్ని సౌకర్యాలతో గోదాము నిర్మించారు. దీనివల్ల ఈ ప్రాంతం రైతులకు ఎంతో మేలు జరిగింది. ప్రస్తుతం ధాన్యానికి గిట్టుబాటు ధరలేకపోవడంలో పలువురు రైతులు గోదాములో నిల్వ చేసుకున్నారు.
– ఆర్.ప్రసాద్‌నాయుడు, తొగరాముడి

గోడౌన్లు రైతుకు అండగా నిలుస్తున్నాయి



గ్రామాల్లో నిర్మించిన గోడౌన్లు రైతులకు అండగా నిలుస్తున్నాయి. పండించిన పంటలు నిల్వ చేసుకోవడంతో పాటు అకాల వర్షాల సమయంలో పంట ఉత్పత్తులు తడిసిపోకుండా గోదాముల్లో దాచుకోవచ్చు. గత ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అనేక చర్యలు తీసుకుంది.
–బాబులు, వేణుంబాకం

నెలకు బస్తాకి రూ.5లు



డీవీ సత్రం మండలంలోని నాలుగు గోడౌన్లు నిర్మించాం. మూడింటిలో రైతులు ధాన్యాన్ని నిల్వ చేసుకుంటున్నారు. బస్తాకు నెలకు రూ.5లు చెల్లించాల్సి ఉంటుంది. ధాన్యానికి గిట్టుబాటు ధర వచ్చినప్పుడు రైతులు విక్రయించుకోవచ్చు. ఈ గోడౌన్లను రైతులకు మాత్రమే ఇస్తాం.
–షేక్ గఫూర్, సీఈవో, పీఏపీఎస్, నెలబల్లి సొసైటీ

క్లుప్తంగా

సూర్యప్రభ వాహనంపై శ్రీమహావిష్ణువు విహారం



సైదాపురం: మండలంలోని కృష్ణారెడ్డిపల్లిలో వున్న వైకుంఠపురంలో శ్రీమహావిష్ణువు, శ్రీమహాలక్ష్మిదేవి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారు సూర్యప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. శుక్రవారం రథోత్సవం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

ఎన్‌బీకేఆర్‌లో సాంకేతిక సదస్సు

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో గురువారం టెక్‌వ్యూహ–2025 సాంకేతిక సదస్సు నిర్వహించారు. ఇందులో పలు ఇంజినీరింగ్ కళాశాలల నుంచి విద్యార్థులు హాజరై ప్రాజెక్ట్‌లను ప్రదర్శించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ సాంకేతిక సదస్సుల వల్ల విద్యార్థుల్లో నైపుణ్యం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌వోడీలు రాజశేఖర్‌రెడ్డి, నారాయణరావు, కొండారెడ్డి పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ పరీక్షలు


వైద్య పరీక్షలు చేస్తున్న స్విమ్స్ వైద్యులు

వాకాడు: మండలంలోని నిడిగుర్తి పీహెచ్‌సీ పరిధిలోని దుగ్గరాజపట్నం, తిరుమూరు గ్రామాల్లో గురువారం తిరుపతి స్విమ్స్ వైద్యులు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. 150 మందికి పైగా బీపీ, షుగర్ పరీక్షలతోపాటు నోరు, రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసినట్టు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి శ్రావణి, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, నిడిగుర్తి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శశికుమార్, సెక్రటరీలు టి.సురేష్, సీహెచ్ సురేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం


విద్యార్థులను సత్కరిస్తున్న ఎంపీడీవో, జెడ్పీటీసీ

సైదాపురం: పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను గురువారం ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్, జెడ్పీటీసీ పోలయ్య ఘనంగా సత్కరించారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించారు. అనంతరం పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన ఎఫ్‌పీవో నారాయణ కుమార్తె శ్రీవల్లి (544), కలిచేడు సీసీ నరసింహులు కుమార్తె (375)ను సన్మానించి బహుమతులు అందజేశారు. పీఎం చంద్రశేఖర్, ఏపీఎం శైలజ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే రీ సర్వే

డక్కిలి: గ్రామీణ ప్రాంతాల్లో రైతులు సమస్యలను పరిష్కరించేందుకే రీ సర్వే చేస్తున్నట్టు తహసీల్దార్ ఎం.శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని డి.వడ్డిపల్లి సచివాలయం పరిధిలోని కొత్త చెరువు రెవెన్యూలో ఈ నెల 15 నుంచి రీ సర్వే చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయన గురువారం సర్వే పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రీ సర్వేలో పక్కాగా హద్దులు ఏర్పాటు చేసి భవిష్యత్తులో ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా చూడాలని విలేజ్ సర్వేయర్లను ఆదేశించారు. సర్వేయర్లు జగదీష్, పూజిత పాల్గొన్నారు.

చర్చి ప్రారంభం

చిట్టమూరు: చిట్టమూరులో నిర్మించిన పెంతకొస్తు ఆలయం (చర్చి)ని గురువారం వైజాగ్‌కు చెందిన దైవ వర్తమానికుడు డేవిడ్‌రాజు ప్రారంభించారు. సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వాకాడుకు చెందిన వేము దినకర్, భరత్ మహీపతి పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

డక్కిలి: మండలంలోని మార్లగుంట, వెలికల్లు చెరువు కట్ట వద్ద గురువారం ఎస్‌ఐ శివశంకర్ ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవులు ఇచ్చిన నేపథ్యంలో పిల్లలు చెరువుల్లోకి ఈతకు వెళ్లి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉన్నట్టు తెలిపారు. ఈ క్రమంలో చెరువుల్లో లోతు ఎక్కువగా ఉందని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. తల్లిదండ్రులు పిల్లలతో అప్రమత్తంగా ఉండాలని కోరారు.

పేకాట స్థావరంపై దాడి

కలువాయి (సైదాపురం): కలువాయి చెరువుకు వెళ్లే దారిలో చింతతోపు వద్ద గురువారం పేకాట ఆడుతున్న వారిపై రాపూరు సీఐ సత్యనారాయణ, కలువాయి ఇన్‌చార్జి ఎస్‌ఐ రామకృష్ణ దాడి చేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని రూ.4,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ముత్యాలమ్మకు నెల పొంగళ్లు


ముత్యాలమ్మకు కుంభంపోసి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

చిల్లకూరు : తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో గురువారం అమ్మవారికి నెల పొంగళ్లు పెట్టారు. గత నెలలో జాతర నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తూర్పుకనుపూరు, ఈదులవారిపాళెం, రావులవారిపాళెం, పోసినవారిపాళెం, కొమరవారిపాళెం గ్రామస్తులు నెల పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు. అనంతరం కుంభంపోసి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో నవీన్‌కుమార్, మాజీ చైర్మన్ సింహాద్రి మనోహర్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీ కాలికి గాయం

చిట్టమూరు: మండలంలోని తాడిమేడు గ్రామంలో గురువారం ఉపాధి పనులు చేస్తుండగా అనపల్లి వెంకటసుబ్బయ్య అనే కూలీ కాలికి తీవ్ర గాయమైంది. అతన్ని వెంటనే క్షేత్ర సహాయకుడు బాబు చిట్టమూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స చేయించాడు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో మనోహర్ గౌడ్ తాడిమేడు గ్రామానికి చేరుకుని వెంకటసుబ్బయ్యను పరామర్శించారు. ఉపాధి హామీ కింద బాధితుడికి పరిహారం అందజేస్తామని తెలిపారు. ఇంటివద్దనే ఉంటూ విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.

జగనన్న కాలనీ ఇళ్ల స్థలాల పనులపై ఆరా

చిల్లకూరు: గత ప్రభుత్వంలో జగనన్న శాశ్వత నివేశ స్థలాల కేటాయింపుపై, చదును పనులపై క్వాలిటీ కంట్రోల్ అధికారులు గురువారం ఉపాధి ఏపీవో గిరిబాబుతో సమీక్షించారు. ఏపీవో మాట్లాడుతూ మండలంలోని 30 పంచాయతీల్లోని 40 ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు కేటాయించినట్టు తెలిపారు. స్థలాలను చదును చేసే పనులతో పాటు జంగిల్ క్లియరెన్స్ చేసినట్టు తెలిపారు. వాటికి సంబంధించిన బిల్లుల చెల్లింపులు పూర్తి చేసేలోగా ఎన్నికల కోడ్ రావడంతో 32 మందికి బిల్లులు చెల్లించలేదన్నారు. క్వాలిటీ కంట్రోల్ అధికారులు మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లోని నివేశ స్థలాలను పరిశీలించి నివేదికలు ఇచ్చిన అనంతరం బిల్లులు చెల్లింపులు చేసుకునేందుకు వీలుంటుందని తెలిపారు. సమావేశంలో క్వాలిటీ కంట్రోల్ అధికారి ప్రదీప్, ఉపాధి ఈసీలు, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వం ఉంటేనే పథకాలు ఇస్తామనడం తగదు


మాట్లాడుతున్న ఎంపీపీ గురవయ్య

గూడూరు రూరల్: టీడీపీ సభ్యత్వం ఉంటేనే ప్రభుత్వ పథకాలు ఇస్తామని చెప్పడం తగదని, అర్హులందరికీ పథకాలు అందజేయాల్సిందేనని ఎంపీపీ బూదూరు గురవయ్య ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పక్కా గృహాలు మంజూరు చేయాల్సి ఉందన్నారు. టీడీపీ సభ్యత్వం ఉంటేనే ఇళ్లు మంజూరు చేస్తామని అధికారులు చెప్పడం మంచి పద్ధతి కాదని, తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. ఉపాధి హామీ పనుల్లోకి వైఎస్సార్‌సీపీ వారు రాకూడదని చెప్పడం దుర్మార్గమన్నారు. వేసవిలో ఎక్కడా తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతకుముందు జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు శ్రీనివాసులురెడ్డి, ఇంద్రాణి, ఎంపీడీవో మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయంలో చలువ పందిళ్లు


ఆలయంలో ఏర్పాటు చేసిన చలువ పందిరి


భక్తుల కాళ్లు కాలకుండా వేసిన తెల్ల సున్నం

రాపూరు: పెంచలకోన పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి ఆలయం చుట్టూ భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు ఏర్పాటుచేసినట్టు అధికారులు తెలిపారు. వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని, ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసే భక్తులకు కాళ్లు కాలకుండా చలువ పందిళ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే ఆర్టీసీ బస్టాండు నుంచి ఆలయం వరకు, అన్నదాన సత్రం ప్రాంతాల్లోనూ పందిళ్లు వేస్తున్నట్టు తెలిపారు. శ్రీవారి ఆలయం నుంచి అమ్మవారి ఆలయం వరకు తెల్ల సున్నం, పట్ట వేసినట్టు వెల్లడించారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి


అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అధికారులు

సూళ్లూరుపేట: షార్‌లోని ఎంఆర్ కురూప్ ఆడిటోరియంలో గురువారం షార్ డైరెక్టర్ ఏ రాజరాజన్ ఆధ్వర్యంలో బీఆర్ అంబేడ్కర్ జయంతిని జరుపుకున్నారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముంబయి ఇన్‌కమ్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్ పి.సుధాకర్ నాయక్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విజన్ ఇంటర్‌సెక్టింగ్ సైన్స్, సోషల్ జస్టిస్ అండ్ ఇండియా ప్రోగ్రెస్ త్రూ ఇస్రో అనే అంశంపై ప్రసంగించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో షార్ కంట్రోలర్ ఎం శ్రీనివాసులురెడ్డి, వాల్ప్ డీడీ డాక్టర్ ఎస్ శంకరన్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

గూడూరు రూరల్: వివిధ పనుల నిమిత్తం ఎంపీడీవో కార్యాలయానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేసినట్టు ఎంపీపీ బూదూరు గురవయ్య తెలిపారు. ఆయన గురువారం ఎంపీడీవో మధుసూదన్‌రావుతో కలిసి గూడూరు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. వైస్ ఎంపీపీలు శ్రీనివాసులురెడ్డి, ఇంద్రాణి పాల్గొన్నారు.

భార్యపై బ్లేడుతో దాడి

సైదాపురం: కలిచేడులో వ్యక్తి భార్యపై బ్లేడుతో దాడి చేసిన విషయం ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ క్రాంతికుమార్ కథనం మేరకు.. కడపలోని శివానందపురానికి చెందిన ఊటుకూరు విష్ణుకు సైదాపురం మండలం కలిచేడుకు చెందిన ప్రసన్నతో వివాహమైంది. వారు కలిచేడులో వుంటున్నారు. అతనికి భార్యపై అనుమానం పెరిగింది. ఈ నెల 22వ తేదీ రాత్రి విష్ణు బ్లేడుతో భార్యపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను కుటుంబ సభ్యులు నెల్లూరు తీసుకెళ్లారు. కేసు దర్యాప్తులో ఉంది.

చెత్త సేకరణ బాధ్యత పంచాయతీలదే


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తడ: వీధుల్లో చెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు తరలించాల్సిన బాధ్యత పంచాయతీ సిబ్బందిదేనని, వారితో పనిచేయించుకోవాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉంటుందని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఆయన గురువారం తడ మండలంలోని తడకండ్రిగలో రెవెన్యూ సమస్యపై వచ్చిన ఫిర్యాదును పరిశీలించారు. ఈ సందర్భంగా మార్కెట్‌లోని వ్యాపారులు చెత్తను కోనేరులో వేస్తున్నారన్న ఫిర్యాదుపై స్పందించారు. చెత్తను పంచాయతీ సిబ్బంది సేకరించకపోవడం వల్లే ఇలా జరుగుతోందని, దీనికి పంచాయతీ కార్యదర్శి బాధ్యత వహించాలని హెచ్చరించారు. అనంతరం తడలోని బీసీ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. పాఠశాలలు ప్రారంభం అయ్యేలోపు మరమ్మతులు చేయించాలని వెల్ఫేర్ అధికారి కృష్ణయ్యను ఆదేశించారు. ఆర్డీవో కిరణ్మయి, సర్పంచ్ తుమ్మా జయప్రద తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో అధికారుల నిరసన


నిరసన తెలుపుతున్న అధికారులు

వెంకటగిరి రూరల్: ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 35ను వ్యతిరేకిస్తూ మండల పరిషత్ కార్యాలయలంలో అధికారులు గురువారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఎంపీడీవోల ప్రమోషన్లలో ఈవోపీఆర్డీలకు 60 శాతం, ఏవోలకు 30 శాతం కేటాయించడం సరికాదన్నారు. ఇరువురికి 50 శాతం కేటాయించాలని కోరారు. జీవో నంబర్ 35లో ఎంపీపీ, జెడ్పీ ఏవోలకు అన్యాయం జరుగుతుందని వాపోయారు. నిరసనకు ఎంపీడీవో కోటేశ్వరరావు, ఎంపీపీ తనుజా రెడ్డి సంఘీభావం తెలిపారు.

పదిలో గాయత్రి విజయ దుందుభి


ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులతో పాఠశాల కరస్పాండెంట్, ఉపాధ్యాయులు

చిల్లకూరు: పదో తరగతి ఫలితాల్లో తమ విద్యార్థులు మంచి మార్కులు సాధించి విజయ దుందుభి మోగించారని గూడూరు పట్టణంలోని గాయత్రి ఇంగ్లీషు మీడియం స్కూల్ కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి తెలిపారు. ఆయన గురువారం విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ప్రథమ స్థానంలో 573 మార్కులతో సహానా, పరమేశ్వరి 572, స్పందన 553, సంబ్రాత్ 532, సాయిపూర్ణచంద్ర 531, సల్మా 524, కుమార్ 512 మార్కులు సాధించినట్టు తెలిపారు. అలాగే 500 మార్కులకు పైగా ఏడుగురు విద్యార్థులు పొందినట్టు వివరించారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు అన్ని సబ్జెక్టుల్లో మంచి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు షీల్డ్‌లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ శ్రీహరి, ఉపాధ్యాయులు మస్తాన్‌బీ, రఫీ, రజనీ, సుప్రజ, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లుపై నిరసన ర్యాలీ


ర్యాలీ చేస్తున్న ముస్లింలు, మత పెద్దలు

నాయుడుపేట టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ముస్లింలు గురువారం నాయుడుపేటలో పెద్ద ఎత్తున శాంతియుత నిరసన ర్యాలీ చేపట్టారు. ముందుగా ముస్లిం మత పెద్దలు జామియా మసీదు సమీపంలోని షాదీ మంజిల్ వద్ద ప్రార్థనలు చేసి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ బజారువీధి, బ్రాహ్మణ వీధి, గాంధీపార్కు, గడియారం సెంటర్, పోలీస్ స్టేషన్ మీదుగా దర్గా సెంటర్, పాత బస్టాండు వరకు సాగింది. గాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు వినతి పత్రాలు సమర్పించారు. వారికి వైఎస్సార్ సీపీ, సీపీఐ, సీపీఎం పార్టీల నాయకులు, క్రైస్తవ మత పెద్దలు సంఘీభావం తెలిపారు.

ఉగ్రదాడి దారుణం

జమ్ము కాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేయడం అమానుషమని ముస్లిం మత పెద్దలు ఖండించారు. దాడుల్లో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు సారథ్యంలో సీఐలు బాబి, సంగమేశ్వరరావు బందోబస్తు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో జామియా మసీదు ముతవల్లీ హాజీ రహంతుల్లా సాహెబ్, మౌలానా అబూ బకర్, షేక్ హమీద్ బాష, హాజీ రహమాత్ బాష, టీచర్ కాలేషా, వక్ఫ్ బోర్డు జిల్లా మాజీ డైరెక్టర్ షేక్ షరీఫ్, హాజీ నిజామ్, షేక్ సుభహాని, మక్కా మసీదు మౌలానా పఠాన్ ఇస్మాయిల్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ


డక్కిలి : యువకుడికి కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ

డక్కిలి/వెంకటగిరి రూరల్ : డక్కిలి ఎస్‌ఐ శివశంకర్, వెంకటగిరి సీఐ ఏవీ రమణ, ఎస్‌ఐ సుబ్బారావు గురువారం వెంకటగిరి–రాపూరు రోడ్డులోను, వెంకటగిరి పట్టణం క్రాస్ రోడ్డు కూడలి వద్ద వాహనాల తనిఖీ చేశారు. ద్విచక్ర వాహనదారు లు హెల్మెట్ ధరించాలని సూచించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.


వెంకటగిరిలో మహిళకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ ఏవీ రమణ, ఎస్‌ఐ

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి


కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న బీజేపీ నాయకులు

నాయుడుపేట టౌన్: జమ్ముకాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ బీజేపీ నాయకులు గురువారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకుని మృతి చెదిన వారికి నివాళులర్పించారు ముష్కరులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రంగినేని కృష్ణయ్య, చిగురాలకుల సురేంద్ర, రాజశేఖర్ రెడ్డి, గాధంశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల శాంతి ర్యాలీ


విద్యానగర్‌లో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

కోట: కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ ఎన్‌సీసీ క్యాడెట్లు గురువారం కళాశాల నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కొవ్వొత్తులు వెలిగించి ఉగ్రదాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఎన్‌సీసీ అధికారులు మాధవయ్య, మల్లికార్జున్‌రెడ్డి, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో పంచాయతీల పాత్ర కీలకం

సైదాపురం: దేశాభివృద్ధిలో గ్రామ పంచాయతీల పాత్ర కీలకమని ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. అనంతరం ప్రతిభ చూపిన అధికారులను సన్మానించారు. జెడ్పీటీసీ పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ సిబ్బందికి సన్మానం

ఓజిలి: ఎంపీడీవో కార్యాలయంలో గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. గాంధీ, బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు ఎంపీడీవో విజయలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిబ్బంది నాగేశ్వర్‌రావు, రవితేజ, వెంకటసుబ్బయ్యను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఎం పద్మమ్మ, ఏపీవో చిన్నయ్య, పంచాయతీ కార్యదర్శి కస్తూరయ్య పాల్గొన్నారు.

వాకాడులో..

వాకాడు: స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఎంపీపీ సలహాదారు, వైఎస్సార్ సీపీ నాయకుడు కొడవలూరు దామోదర్‌రెడ్డి దేశ నాయకుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజలకు స్థానికంగానే ప్రభుత్వ సేవలు అందించేందుకు పంచాయతీ రాజ్ శాఖను తీసుకువచ్చారని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, సర్పంచు డి.భాస్కర్‌రెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.




ఓజిలి : పంచాయతీరాజ్ సిబ్బందికి సన్మానం, సూళ్లూరుపేట రూరల్ : కార్యదర్శులను సన్మానిస్తున్న ఎంపీపీ, అధికారులు

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట రూరల్: సూళ్లూరుపేట ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీడీవో మురళీ ఆధ్వర్యంలో పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీరాజ్ శాఖ సిబ్బందిని ఎంపీపీ అల్లూరు అనీల్‌కుమార్‌రెడ్డి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ గ్రామల అభివృద్ధిలో పంచాయతీరాజ్ శాఖ పాత్ర కీలకమన్నారు.

చిట్టమూరులో..

చిట్టమూరు: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో మనోహర్ గౌడ్ మాట్లాడుతూ పంచాయతీల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు.